# దత్తత

★

"రంగధామ్"

"ధ్యానమే వరమైన గంగాస్నానమే" అన్న పాటరేడియోలోంచి వినవస్తోంది. శర్మగారు పూజా గృహంలో కూచుని ఎదురుగా సింహాసనంలోని విగ్రహాలమీద నిర్మాల్యాన్ని తీసేసి, పూజకు ఆయత్తమౌతున్న సమయం అది. అంటే ప్రొద్దున ఎనిమిది గంట లైందన్నమాట.

ఆ పూజాగృహం మధ్యగా, యంత్ర స్థాపితం చేసి, నవరత్నాల్నీ పొదిగిన మండపం, ఆ మండపంమీద పంచాయతన విగ్రహాలున్న సింహాసనం. ఆ మందిరంనిండా దేవుళ్ల పటాలూ, భగవదారాధనా ద్రవ్యాలే. మండపాని కెదురుగా పీటలమీద శర్మగారూ, ఆయన భార్యా కూచొని పూజ చేస్తారు. ఆ గృహంలో ఒకమూల రేడియో, ఆ రేడియోలోంచి అనవరతంగా వినవచ్చే శాస్త్రీయ, దైవ సంబంధ సంగీతం చెవుల్లో పడ్తూంటే ఆయన తన నిత్య కార్యక్రమం జరుపుకుంటూంటారు. శర్మగారు నిజమైన భగవద్భక్తులు.

ఆయన వయస్సు అరవై యేళ్లు. రోజూ విధిగా సూర్య నమస్కారాలు చెయ్యడంవలన, ఆరోగ్యం బాగుండి, కాయ శరీరంగా మారిన, పచ్చని విగ్రహం. నున్నటి గుండు మీద చిన్న పిలక. కళ్లజోడూ, విభూతి బాగా పూసిన నుదురూ, మొహాన్ని చిరునవ్వూ, మెళ్లో రుద్రాక్షలూ, వీటి అలంకరణతో ఆయన దర్శనం చూపరుల నందరినీ ఆకర్షిస్తుంది.

ఆయన చిన్నతనం నుండీ ఈ దైవారాధన అవిచ్ఛిన్నంగా జరుపుకు వస్తున్నారు. గవర్నమెంటు సర్వీసులో ముప్ఫైఏళ్లు గడిపి, అనేక ఊళ్లు తిరిగి, చివరకు రిటైరై పదివేల రూపాయలతో ఏలూరులో ఒక ఇల్లు కట్టుకుని, అందులో తనకు నచ్చిన విధంగా పూజా గృహాన్ని ఏర్పరచుకొని, శేషించిన జీవితాన్ని కూడా దైవసన్నిధిలోనే గడిపెయ్యదల్చారు. రోజూ ఎలా లేదన్నా, ధ్యానం, జపం, పూజా, సూర్య నమస్కారాలూ మొదలైన కార్యక్రమం ప్రొద్దున్నపూట ఆరేడు గంటల కాలం తీసుకుంటుంది. రాత్రి మళ్లీ జపం, స్తోత్ర పఠన, హారతీ వగైరా మూడు నాలుగు గంటలు పడ్తుంది. అదికాక రాత్రి భోజనం అయ్యాక భజనలు గాని, సంగీత కచ్చేరీలు గాని ఉంటే వాటికి కాల నిర్ణయమే లేదు.

ఇంతకాలమూ తన కార్యక్రమానికి భంగం లేకుండా జరుపుకుంటూ వచ్చారంటే ఆయనలో ముఖ్యంగా ఉన్న పట్టుదలే కారణం. ఒక వ్యక్తి మంచికార్యం చేస్తున్నాడంటే హర్షించేవాళ్లకన్నా, అనుమానించేవాళ్లూ, పరీక్షించేవాళ్లూ, అవహేళన చేసేవాళ్లూ ఎక్కువ మంది ఉంటారు. మొదట్లో శర్మగారి పూజల్ని చూసి, 'ఇదం దంభం!' అన్నారు కొందరు. అస లిందులో ఏదో కిటుకు ఉందేమో ? నని మరికొందరు అనుమానించారు. కొందరు 'ఇలాటివి చాలా చూశామని' ఆయన కేవలం కాంతా కనకాలమీద వ్యామోహంతో చేస్తున్నాడని, దుష్ప్రచారం చేశారు. కాని, క్రమంగా వీరంతా కూడా ఆయన శిష్యులుగా మారారు. ఆయనవద్ద పూజా విధానం, సూర్య నమస్కారాలూ నేర్చుకున్నారు. చివరకు ఆయన ఒక మహాత్ముడిగా భావించబడే స్థితికి వచ్చారు. ఆయన మాత్రం వీరి నందరినీ అప్పుడూ ఇప్పుడూ ఒకలాగే ఆదరించారు. స్వచ్ఛమైన మనస్సుతో అందరి ప్రేమా పొందారు.

ఒక పవిత్రమైన నదీ ప్రవాహంతో ఆయన జీవితాన్ని పోల్చవచ్చు. ఆ నదిలో అందరూ స్నానంచేసి తమ మాలిన్యాన్ని వదలగొట్టుకుంటూంటారు. ఆ నదిలో నీరు త్రాగి తమ దాహం తీర్చుకుంటారు. ఇంతమందిని కాపాడిన ఆ నది, తన స్వచ్ఛతను తనలోనే నిలుపుకొని మళ్లీ తన దారిన అది సాగిపోతూంటుంది. అదేవిధంగా ఆయన తన వద్దకు వచ్చినవారందరికీ దైవభక్తి కలిగిస్తూంటారు. వారిని ఆదరంతో, ప్రేమతో, సానుభూతితో పల్కరించి వారి కష్టాలకూ, దుఃఖాలకూ తనకు తోచిన నివృత్తి మార్గం ఉపదేశిస్తుంటారు. ఎందుకంటే, ఆయనకు జ్యోతిషం కూడా వచ్చు. అందువలన ఆయా వ్యక్తుల జాతకాల్ని పరిశీలించి మంచీ చెడులను తెల్పగలరు.

అంతేకాక ఆయన ఇల్లొక సత్రంలా ఉండేది. ఆయనకు పిల్లలు లేరు. భార్యా భర్తలూ, అత్తగారే అవటంవల్ల,

ఆయన సంపాదన ఆయనకు చాలగా, పైన మిగులుతూండేది. కాబట్టి అతిథుల్నీ, ఆశ్రితుల్నీ తప్పక ఆదరించేవారు. ఎవరైనా కష్టాలలో ఉంటే వారికి శర్మగారు తన శాయశక్తులా సహాయం చేసేవారు.

ముఖ్యంగా సంగీతం అంటే ఆయనకు చాలా యిష్టం. అందువలన సంగీత విద్వాంసుల్ని విధిగా ఆదరించేవారు. ఎంతో మంది సంగీత విద్వాంసులు, ఆఊరొచ్చి, ఆయన ఇంట్లో నెలలకొద్దీ, సంవత్సరాలకొద్దీ కూడా ఉండి, తమ కొక స్థావరం ఏర్పడ్డాక ఆయన ఇంట్లోంచి కదలడం జరుగుతూండేది. వారందరినీ ఆదరించడం తన ధర్మంలా ఆయన భావించారు.

భగవధ్యానం యొక్క శక్తి ఇంతా అంతా అని చెప్పలేము. మనిషియొక్క ఆత్మను, నిరంతరం భగవత్స్పర్శలో ఉంచగలిగిందే ధ్యానం. అది గంగాస్నానంలా మనిషిని పునీతుణ్ణి చేసి, విశుద్ధ మనస్కుడిగా చేస్తుంది. అతన్ని సుఖదుఃఖాలూ, రాగద్వేషాలూ, కామక్రోధాదులు అంటవు. జీవితంలో ఒక్కసారైనా ధ్యానం ద్వారా భగవంతుని అసమాన సౌందర్యం యొక్క అంచుల్ని తిలకించగలిగితే, ఆ ఆనందంలో మైమరిస్తే మానవుడింక ఈ ప్రపంచంలో దేనినీ కోరడు. ఆ భగవత్స్వరూపాన్నే కోరుతూంటాడు.

శర్మగారి ఆరాధనకు మూలం ఆ ధ్యానమే. అది ఆయనలోని దైవచింతను మేల్కొలిపి, దైవశక్తి నుద్దీపింపజేసింది.

తనకు జీవితంలో కావలిసినవి అన్నీ ఉన్నాయని, తనకు లభించినవాటితో తృప్తిపడ్డారు ఆయన. కాని ఆయన సహధర్మచారిణి అలా తృప్తిపడలేదు. అన్ని విషయాలలోనూ, మనసా, వాచా, కర్మణా ఆమె ఆయన ననుసరించింది. ఆయన భక్తిని ఆమె సులభంగా అలవర్చుకుంది. ఆయన పరోపకార చింతను మౌనంగా అంగీకరించింది. ఆయన అలవాట్ల నన్నిటినీ కూడా తన అలవాట్లుగా మార్చుకుంది. ఆయనలో లేని సంతానవాంఛను మాత్రం, తను చంపుకోలేక పోయింది.

అది స్త్రీ యొక్క సహజవాంఛ! తమ యిద్దరి జాతకాలలోనూ కూడా ఆ యోగం లేదని ఎన్నిసార్లు ఆయన చెప్పినా ఆమె సమాధాన పడలేదు.

గత ముప్ఫైఏళ్ళుగా ఆ దంపతు లిద్దరూ ఎంతో మంది పరాయి పిల్లల్ని చేరదీసి, వారికి సాయంజేస్తూ, మురిసిపోతూండేవారు. ఆ పిల్లలు చిన్నతనంలోనే శర్మగారిలా దైవభక్తి నలవరచుకొని, ఆయన పూజలకు విధిగా హాజరవుతూ ఆయనకు ఆనందం కల్గిస్తూండేవారు. క్రమంగా వాళ్ళు పెద్ద చదువుల కోసమో, ఉద్యోగాల కోసమో పరాయి ఊళ్ళకు వెళ్ళిపోయేవారు. తరువాత ఎప్పుడైనా వచ్చి, 'బాబుగారు' అనో 'గురువుగారు' అనో "మామగారు" అనో ఆయన్ని గురించి చెప్పుకుని, తాము ఆయన వలననే వృద్ధిలోకి వచ్చేమంటే, శర్మ దంపతుల కెంతో ఆనందంగా ఉండేది. 'వీళ్ళంతా మనవాళ్ళే' అని ఆయన సంతోషిస్తే, 'వీళ్ళంతా పైవాళ్ళే కదా, నా అన్న నలుసు ఒక్కడైనా లేడు కదా' అన్న భావం ఆమె మనసులో ఒకమూల మెరిసేది. లక్ష్మీదేవి చాలా శాంతంగల మనిషి. కాబట్టి ఏనాడూ తన మనసులోని భావం బయట పెట్టలేదు, శర్మగారు రిటైరయ్యేదాకా.

సర్వీసునుండి రిటైరయాక సహజంగానే, తమ చరమావస్థ నుంచి ఆ దంపతులలో ఆలోచనలు రేకెత్త సాగాయి. ఇతరులనే మాటలు లక్ష్మీదేవికి తన మనసులోని కోర్కెను బలీయం చెయ్యగా, క్రమంగా ఆమె, శర్మగారి చేత, తాము ఎవరినైనా పెంచుకోవడం అవసరమనే విషయం ఒప్పించింది. తాము రోగగ్రస్థు లయితే తమకు చాకిరీ ఎవరు చేస్తారు ? తమ మరణానంతరం తద్దినాలు ఎవరు పెడతారు? అన్న కఠిన ప్రశ్నలకు సమాధానం దొరకక, ఎవరినైనా పెంచుకుంటే తప్ప గత్యంతరం లేదనే స్థితికి వచ్చారు.

ఎవరిని పెంచుకోవాలీ ? అన్నది తరువాతి సమస్య. ఆయన భక్తినీ, అలవాట్లనూ, ఆమోదించగలవారు తప్ప, సామాన్యులు ఆ యింట్లో ఉండలేరు. పసిపాపను చేరదీసి, పెంచే వయసు కాదా దంపతులది. వీలైనంత త్వరగా చేతికి అందివచ్చే వయసుగల కుర్రవాడు కావాలి. ఆయనకు శిష్యులు అసంఖ్యాకంగా ఉన్నారు. అనేకమంది సంగీత విద్వాంసులూ, పండితులూ ఆయన ఇంట్లో ఏళ్ళకొద్దీ ఉండి, ఆయన ఋణం ఎలా తీర్చుకోగలమా ? అని బాధపడుతున్నవాళ్ళున్నారు. కానీ వారందరూ వివాహాలై, సంసారులైనవాళ్ళు. వాళ్ళెవర్నీ పెంచుకోవడానికి శాస్త్రం ఒప్పుకోదు. బంధువర్గంలోని కుర్రాళ్ల నిద్దరు ముగ్గుర్ని, తమ ఇంట్లో నాలుగైదు నెల లొక్కొక్కరి నుంచుకుని, వాళ్ళు తమకు పనికి వస్తారేమోనని చూశారు. కాని, పదిహేను పదహారు సంవత్సరాల వయసుగల ఆ కుర్రవాళ్ళు, శర్మగారి ఇంటి పద్ధతుల నెంతమాత్రం హర్షించలేకపోయారు. వాళ్లకు బొత్తిగా దైవభక్తి లేదని, శర్మగారు కూడా వాళ్ల నంగీకరించలేదు. ఇలా మూడు నాలుగేళ్ళు, కుర్రాళ్లను ఎంచుకోడంలోనే గడిచిపోయింది.

ఆయన ఆస్తి, పెద్ద మొత్తం కాకపోయినా, ఇల్లూ, ప్రావిడెంట్‌ఫండూ డబ్బుతో కొన్న పొలం ఆరెకరాలూ, సుమారు పాతిక ముప్ఫై వేలు చేస్తుంది. ఇదికాక లక్ష్మీదేవి

వంటిమీద నూరు తులాల దాకా బంగారం ఉంది. ఇంట్లో బోలెడు వెండిసామానుంది. ఇవన్నీ ఆ చుట్టుప్రక్కల నున్న వారి బంధువుల నాకర్షిస్తూనే ఉన్నాయి. కాని ఆయన పద్ధతులకు ఓర్చుకోవడం ఎలాగా ? ? అన్న ఆలోచనతో, దగ్గరికి రాలేకపోయారు.

చివరికి సూర్యనారాయణ అనే పదిహేడేళ్ల కుర్రవాడు ప్రాప్తించాడు. ఆ కుర్రవాడు ఉన్నట్లుండి తనంత తనే వచ్చి ఆయన పూజ చేసుకుంటూవుంటే గంటలకొద్దీ కూర్చుని చూస్తుండేవాడు. ''నాకూ అలా పూజ చెయ్యాలని ఉంది'' అనీ, ''నాకీ యింట్లో ఉండిపోవాలని ఉంది'' అనీ అనడం ప్రారంభించాడు. నెల రోజుల లోపలే, శర్మగారికీ, లక్ష్మీదేవికీ కూడా అతనియందొక విధమైన మమకారం ఏర్పడింది. అతనినే పెంచుకోవాలని ఆసక్తి కలిగి, అతని తలిదండ్రులతో సంప్రదించారు.

సూర్యనారాయణ తండ్రి సీతారామయ్యగారిది ఆ ఊరే. శర్మగారి ఇంటికి ఒక ఫర్లాంగు దూరంలో ఆయన ఇల్లు ఉంది. ఆయన ప్లీడరు గుమాస్తాగా పనిచేస్తున్నారు. ఆయనకు నలుగురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ ఉన్నారు. సూర్యనారాయణ మూడోవాడు. సాటి శాఖవారే అయినా, సీతారామయ్యగారికీ శర్మగారికీ అంతకుముందెంతమాత్రం పరిచయంలేదు. దత్తత విషయం శర్మగారు ఆయనవద్ద కదిపేసరికి ఆయన ఎంతో ఆశ్చర్యం ప్రకటించి తన కటువంటి అభిప్రాయం ఎంతమాత్రం లేదన్నారు, సీతారామయ్యగారు. శర్మగారు మరీ మరీ బలవంతం చెయ్యగా, చివరకు సీతారామయ్యగారు తన కొడుకుని దత్తత ఇవ్వడానికి అంగీకరించారు. అప్పటినుండి సీతారామయ్యగారు, ఆయన భార్యా, శర్మగారినీ, లక్ష్మీదేవినీ తోడునీడలా కనిపెట్టుకు తిరగసాగారు. ఎంతో భక్తిశ్రద్ధలతో పరిచర్య చెయ్యడానికి సీతారామయ్యగారి కుటుంబం, తరుచూ శర్మగారింటోనే ఉండసాగారు. రిజిష్టరు చెయ్యందే దత్తత చెల్లదు కాబట్టి, ఆ వ్యవహారమంతా తనపైన వేసుకున్నారు సీతారామయ్యగారు.

పొలం పిల్లవాడి పేర రాసేస్తూ, ఇల్లూ, మిగిలిన చరాస్థి తమ దంపతు లిద్దరూ తదనంతరం దత్తుడికి చెందేటట్లు రాసి రిజస్ట్రీ చేయించారు శర్మగారు. తమ యెడల సీతారామయ్యగారు చూపిస్తున్నవిధేయత చూస్తుంటే శర్మగారికి ఎంతో సంతోషం వేసింది. భగవంతుడు ప్రతీ విషయంలోనూ తనను కాపాడుతున్నాడని నమ్మే శర్మగారు, ఇదంతా భగవదిచ్ఛ యనే భావించారు.

దత్తతా, ఉపనయనం చాలా ఆర్భాటంగా జరిగాయి. శర్మగారి శిష్యులూ, స్నేహితులూ, ఎక్కడెక్కడవాళ్లూ వచ్చి కానుకలు చదివించారు. మూడు రోజులు పెద్ద సంతర్పణలే జరిగాయి. చాలామంది, ఇన్నాళ్లకు శర్మగారు ఈపని చేస్తున్నందుకు సంతోషించారు. కానీ, ప్రతివారి హృదయంలోనూ మెసలిన విషయం శర్మగారు చాలా శాంత స్వభావులూ అమాయకులూ కాబట్టి, లోకంలో అన్ని దత్తతల లాగా, ఈ దత్తత కూడా, కేవలం ధనాపేక్ష ప్రధానంగా ఉండకుండా, శర్మ దంపతుల వంటి సత్పురుష, స్త్రీ వ్యక్తులకు సేవ చెయ్యడమే పరమార్థంగా ఉంటే బాగుండునని.

సీతారామయ్యగారూ, ఆయన భార్య కూడా వచ్చినవారందరితోనూ అదే చెప్పారు. సూర్యనారాయణ పుట్టటం తమ ఇంటోనైనా అతను శర్మగారి కోసమే పుట్టాడన్నారు. ఐహికాముష్మికాలలో, ఉత్తమమైన ఆముష్మికం కోసమే తాము ఈ దత్తత నిస్తున్నామన్నారు. శర్మ దంపతులకు ఏ లోటూ రానీకుండా చూస్తామన్నారు. వీరి మాటలు చాలమందిని తృప్తి పరచాయి. కానీ, అంత పకడ్బందీగా, దత్తతకు ముందే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, ఐహికానికి వారి మనస్సులలో గల ప్రాధాన్యతను తెలియబరుస్తోందని కూడా అనుకున్నవారు లేకపోలేదు. మొత్తంమీద అందరి మనస్సులనూ రంజింపజేసిన విషయం,సూర్యనారాయణకు శర్మగారియందు లక్ష్మీదేవియందూ గల ప్రేమాభిమానాలు. అతని ప్రవర్తన అందరికీ నచ్చింది. అందరూ మనఃపూర్వకంగా అతని నాశీర్వదించారు.

దత్తత జరిగిన రెండు, మూడు నెలలకల్లా, అందరి మనస్తత్వాలు బయటపడ్డాయి. సీతారామయ్య గారికీ, ఆయన భార్యకీ శర్మగారి ఇంట్లో ఖర్చులేమీ నచ్చలేదు. ఆయన పెన్షన్‌తో సహా తమ చేతిలో డబ్బంతా పోసేస్తే, ఆ యింటి యజమాన్యం తామే వహిద్దామనుకున్నారు. గాని, లక్ష్మీదేవి అటువంటిదేదీ పొసగనివ్వదని తెలుసుకోగానే, వారు రాకపోకలు తగ్గించుకున్నారు. రెండు కుటుంబాల మధ్య ఉన్న స్నేహం కూడా పల్చబడింది. ఒకరి పనులు ఒకరికి నచ్చకుండాపోయాయి. ఒకరి మాటలు మరొకరికి గిట్టలేదు. 'లక్ష్మీదేవి వంటినున్న బంగారం కూడా తమకిస్తే బాగుండునని' వారికి ఉంది. 'ఇంత ధనాపేక్ష గలిగిన మనుష్యుల పిల్లణ్ణి పెంచకున్నామే, మన ఆశలు నెరవేరుతాయా ?' అన్న సందేహం వీరికి కలిగింది. సూర్యనారాయణ ప్రవర్తన కూడా తదనుగుణ్యంగానే మారింది.

ఆ పిల్లవాడు ఈ రెండు కుటుంబాల మధ్యా నలిగిపోసాగాడు. చిన్నప్పటినుండీ పెరిగిన సీతారామయ్యగారి యింటినీ,

కన్న తల్లిదండ్రులనూ వదులుకోలేడు. ఇటు తన నాదరిస్తున్న శర్మగారిని కాదనలేడు. మొదట్లో శర్మగారింట్లో ఉంటూ వచ్చినా, రానురాను సీతారామయ్యగారింట్లోనే ఉండ నారంభించాడు. ఏడెనిమిది నెలలు గడిచేసరికి, కేవలం రోజు కొక సారి వచ్చి, గంటో, రెండు గంటలో శర్మగారి యింటిలో గడిపి వెళ్ళిపో నారంభించాడు. సంవత్సరం దాటేసరికి అది కూడా తగ్గింది.

అతను మొదటి రోజుల్లో చూపించిన ఆసక్తీ, శ్రద్ధా, అంతా నటనేమో ననీ, అదంతా ముందునుంచీ సీతా రామయ్యగారు శర్మగారి ఆస్తిని కాజెయ్యడానికి వేసిన పథకం అనీ అందరికీ అనుమానం కలిగింది.

లక్ష్మీదేవి మనసు ఈ దత్తతలో పూర్తిగా వికలమై పోయింది. కొడుకును చూసి లోకంలో అందరి తల్లులలాగే మురిసిపోదా మనుకున్న ఆమెకు ఈ విపరీత ధోరణులూ, మోసాలూ, చాలా విచారం కల్గించాయి. తన కడుపున పుట్టక పోయినా, తనవా డవుతాడు కదా అని.', "మా అబ్బాయి !" అని చెప్పుకుంటున్న సూర్యనారాయణ, ఏదో వెట్టికి చేస్తున్నట్టు, తమ యింటికి వచ్చి వెళ్ళిపోవడం, అంటీ అంటనట్టు మెసలడం, తన కన్నవారిమీదే మక్కువతో ఉండడం, వారి మాటలకే ప్రాధాన్యత నివ్వడం, రానురాను తనను ఆప్యాయంగా పలకరించక పోవడం, మొదలైన విషయాలన్నీ మనసుకి ముళ్ళలా బాధించసాగాయి. తాము వాడికోసం ఏం చేసినా, ఏం కొన్నా, ఏం పెట్టినా కూడా తమయందు వాడికి పూర్తి అనురాగం కల్గుతుందనే ఆశ పోయింది.

తన సహజ వేదాంతం, భగవద్భక్తి, జ్యోతిషం, అన్నిటి జ్ఞానంతోనూ శర్మగారు, ఈ పరిస్థితికి అంతగా క్రుంగి పోలేదు. కాని, తన నిర్మలమైన మనసుతో ఎదుటివారిని నమ్మినప్పుడు, వాళ్లలో ఇటువంటి ద్రోహచింతన ఎందు కుండాలా ? అని అప్పుడప్పుడు విచారించేవారు. ఇది కూడ భగవంతుడు తనకు పెట్టిన పరీక్షేనని సరిపుచ్చుకుంటూ వచ్చారు.

నాలుగు రోజుల్నుంచి సూర్యనారాయణ తమ యెడల అత్యధిక భక్తిశ్రద్ధలు చూపిస్తూండడం గమనించిన శర్మ దంపతులు, అతని మనసు మారిందేమోనని అపోహ పడ్డారు. గాని, అంతకుముందు రోజు రాత్రే అతనూ, అతని పినతల్లీ వచ్చి అసలు విషయం బైటపెట్టారు. సూర్యనారాయణకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు సీతారామయ్యగారు. ఒక మంచి సంబంధం కుదిరింది. కాని, పిల్ల తరఫువారు, పెళ్లికి పిల్లకు బంగారం ఎంత పెడ్తారో చెప్పమంటున్నారు. లక్ష్మీదేవి గనక అధమం ఏభై తులాలైనా బంగారం పిల్లకు పెళ్లి సమయంలో పెట్టదల్చుకుంటే ఈ సంబంధం నిశ్చయం చేసుకుని త్వరలో వివాహం జరిపించదల్చుకున్నారు. ఆమె అంగీకారం కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఈ నాలుగు రోజుల్నుంచి అధికమైన భక్తిశ్రద్ధలు చూపించడం వెనుక దాగిఉన్న ఉద్దేశం ఇదీ అని తేలిపోయింది.

ఆరోజు ప్రొద్దున్న ఎనిమిది గంటలకు పూజాగృహంలో కూచొని రేడియోలో నుండి వస్తున్న పాటలు వింటున్న శర్మగారి మనసులో, కొద్ది సేపటి నుండీ సూర్యనారాయణ ప్రవర్తన గురించి రేకెత్తిన బాధాకరమైన భావాలన్నీ, ఆ పాట వినడంతో పటాపంచ లయ్యాయి. భగవద్ధ్యానం ఎంత గొప్పదో రోజూ తెలుసుకుంటున్నా, ఇంకా తెలుసుకోవలసింది ఉంటూనే ఉంటుంది. జీవితంలోని అన్ని బాధల్నీ పోగొట్టజాలింది భగవ ద్ధ్యానమేనని అనుకుంటూ పూజకు కూర్చున్నారు. లక్ష్మీదేవి కూడా వచ్చి ఆయన ప్రక్కన కూచుంది. ఇద్దరూ పూజ చెయ్యసాగారు.

ఆయన పూజ ప్రారంభించే సమయానికి పై ఊరు నుంచి గాని, ఆ ఊరిలోవారు గాని పూజ చూడడానికి ఎవరైనా వ్యక్తులు వస్తూండడం అలవాటు. ఆ వచ్చినవారు పువ్వులో పళ్లో ఏవో ఒకటి తప్పక తెస్తారు. అందుకని పూజా గృహం గుమ్మం వద్ద పళ్లెం ఉంచడం, పూజ చేస్తున్నప్పుడు ఆ పళ్లెం తీసుకుని అందులోని పూలనూ పళ్లనూ అర్పించడం రోజూ జరిగే విధి.

ఆరోజు పూజ జరుగుతుంటే ఒక వ్యక్తి వచ్చాడు. అతను ఉత్తర హిందూ దేశీయునిలా ఉన్నాడు. పంచెకట్టూ, లాల్చీమీద ఓవర్‌కోటూ, తలమీద టోపీ, అతను బెంగాలియో, మార్వాడీయో అయిఉండవచ్చునని తోపిస్తోంది. నల్లగా, పొట్టిగా ఉన్నాడు. దళసరి అద్దాల కళ్లజోడు పెట్టుకున్నాడు. మొహంలో ఒక విధమైన మొద్దుతనం కనుపిస్తుంది. అతను చిన్న సంచీలోంచి రకరకాల పువ్వులూ, పళ్లూ తీసి, పళ్లెంలో పెట్టి, అక్కడే పరచిన తివాసీపై కూర్చున్నాడు. పూజ జరుగుతూంటే, పళ్లెం తీసుకుంటూ లక్ష్మీదేవి అతనివై పొకసారి చూసింది. కొద్ది క్షణాల వరకూ ఆమె ఆలోచించి పోల్చుకోలేక పోయింది. అతను మట్టుకు "నమస్తే మాతాజీ!" అని రెండు చేతులూ జోడించాడు.

పూజవుతున్నంతసేపూ ఎంతో భక్తి శ్రద్ధలతో కూర్చున్నాడు. పూజవగానే శర్మగారు తీర్థం ఇచ్చే సమయంలో కొత్త వ్యక్తిని చూశారు. ఆ వెంటనే ఆ వ్యక్తి ఆయన

యెడల ఎంతో గౌరవ మర్యాదలతో సాష్టాంగదండ ప్రణామం చేసి, "నమస్తే బాపుజీ" అని వినయంగా నుంచున్నాడు. అతనిని శర్మగారు వెంటనే పోల్చేశారు. చిరునవ్వుతో హిందీలో "ఏం, హరిబాబూ! ఎప్పుడు వచ్చావు?" అని ప్రశ్నించారు. అతను కూడా హిందీలోనే జవాబిచ్చాడు.

"ప్రొద్దున్నే వచ్చాను బాబుజీ. బిస్తర్ స్టేషనులో ఒక తెలిసిన స్నేహితుడుంటే అప్పజెప్పి వచ్చాను. మద్రాసు వెళ్తూ దారిలో మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను. నా అదృష్టం బాగుండి మీ దర్శనమైంది." అన్నాడు.

"బాబా నీతో రాలేదా?"

"బాబా చనిపోయి నాలుగేళ్లయింది. బాబుజీ" అన్నాడు విచారంగా. శర్మగారు "రామ! రామ!" అన్నారు. లక్ష్మీదేవి, "ఎవరూ?" అని ప్రశ్నించింది. ఆమెతో శర్మగారు "నువ్వి తన్ని పోల్చావా?" అని అడిగారు. దాని కామె ఆలోచిస్తూ "మన సితార్ బాబాగారి అబ్బాయా?" అంది. ఆయన అవునన్నారు. ఆమె, "అయ్యో పాపం! ఆయన పోయి నాలుగేళ్లయిందా! రోజులు ఏలా గడిచిపోతాయి! పదేళ్లయిం దను కుంటాను ఆయన్ను చూసి. హరిబాబును చూడగానే గుర్తు పట్టలేక పోయాను. అప్పటికీ, యిప్పటికీ చాలా తేడా ఉంది." అని ఆ వ్యక్తివైపు చూసి "మీ భార్యా బిడ్డలు బాగున్నారా?" అని అడిగింది.

"మీ దయవల అంతా బాగున్నారమ్మా" అన్నాడు హరిబాబు, హిందీలో.

ఆరోజుకు అతన్ని తమ యింట్లో ఉండి, మర్నాడు వెళ్లవచ్చునని బలవంతంచేస్తే, అత నందుకు అంగీకరించి, స్టేషను నుండి తన బిస్తర్ తెచ్చేసుకున్నాడు. తరువాత సూర్యనమస్కారాదులు ముగించుకొని శర్మగారు భోజనానికి కూర్చునేసరికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. భోంచేస్తూ, అంతా ఒకసారి పాతరోజులు తల్చుకున్నారు.

సుమారు పదిహేనేళ్ల క్రిందట, రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో శర్మగారి వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అందులో ఒకాయనకు ఏభై అయిదేళ్లకు పైగా వయస్సుంటుంది. తెల్లటి, పొడుగాటి గడ్డంతో పచ్చని ఛాయ గల, సన్నని, వడిలిపోయిన విగ్రహం ఆయనది. మెల్లిగా మాట్లాడుతూ, తమది ఉత్తర హిందూస్థానంలో, రాజస్థాన్ ప్రాంతానికి చెందిన ఊరనీ, తను సితార్ వాయిస్తాననీ, ఇక్కడ ఎవరైనా సంగీతం నేర్చుకునే కుతూహలం గలవా రుంటే, ట్యూషను చెప్పుకుందామని వచ్చా నన్నారు. శర్మ గార్ని గురించి ఎవరో చెప్పగా విన్నా మన్నారు. ఆయన హిందీలోనే మాట్లాడారు. తనతో ఉన్న వ్యక్తి తన కొడుకే ననీ, తబలా వాయిస్తాడనీ చెప్పారు. తమకు తమ దేశంలో సరియైన ఆదరణ లేకపోవడంవల్ల ధనార్జనకోసం దేశమంతా తిరుగుతున్నా మన్నారు. ఆయన పేరు బన్సీలాల్. ఆయన కొడుకు హరిబాబు.

బన్సీలాల్ ఒక గంటసేపు సితార్ వాయించి శర్మ గారికి వినిపించారు. ఆ వాయిద్యంలో ఉన్న మృదుత్వమూ, పొంకమూ ఆయన నాకర్షించింది. అసలు బన్సీలాల్ మాటా, ప్రవర్తనా కూడా మృదువుగా, శాంతంగా, హుందాగా ఉంటాయి. హరిబాబుని చూసిన వారికి సరిగ్గా అందుకు వ్యతిరేక భావాలు కల్గుతాయి. తండ్రి పోలిక అతనిలో ఎంత మాత్రమూ లేదు. నల్లగా, మోటుగా కన్పించేవాడు. అతను తన తండ్రితో తప్ప ఎవరితోనూ మాటే ఆడేవాడు కాడు. వీ రిద్దరిలోనూ ఉన్న వ్యత్యాసం ఎవరికైనా, నిజంగా వీ రిద్దరూ తండ్రీ కొడుకులేనా అన్న అనుమానం కల్గిస్తుంది.

వారిద్దరినీ తమ యింట్లోనే ఉండమని శర్మగారు కోరారు. ఇది శర్మగారు బెజవాడలో ఉద్యోగం చేస్తున్నప్పటి సంగతి. రోజూ రాత్రిపూట బన్సీలాల్, శర్మగారింట్లో గంటలకొద్దీ సితార్ వాయిస్తూ ఉండేవాడు. అనేకమంది సంగీతప్రియులు, శర్మగారి స్నేహితులూ, శిష్యులూ వచ్చి విని ఆనందిస్తుండేవారు. రెండు మూడు నెల లయ్యాక క్రమంగా ఒకరూ, ఇద్దరూ బన్సీలాల్ వద్ద సితార్ నేర్చుకోవాలని చేర సాగారు. కర్ణాటక సంగీతం వచ్చిన కొందరు హిందూస్థానీ సంగీతం కూడా నేర్చుకుంటే తమ విద్య రాణిస్తుందని, బన్సీ లాల్ శిష్య లయ్యారు.

ఒక ఏణ్ణర్థంపాటు శర్మగారింట్లో ఆతిథ్యం పొందాక, తనకు కావలసిన ట్యూషన్లు కుదిరాయనీ, ఇంకా శర్మగారికి శ్రమ యివ్వడం తగదనీ, బన్సీలాల్ వేరే గది తీసుకుని, తండ్రీ, కొడుకు లిద్దరూ అందులోకి వెళ్లిపోయారు. తరువాత కూడా వారానికి మూడు నాలుగుసార్లు వచ్చి శర్మగారింట్లో సితార్ వాయిస్తుండేవారు.

తరువాత అయిదేళ్ల వరకూ ఈ ప్రాంతంలోనే తిరుగ్తు తూండేవారు. కాని రానురాను ఏలూరు, రాజమండ్రి, విశాఖ పట్నం మొదలైన ఊళ్లు తిరుగుతూ వాద్య ప్రదర్శన లిస్తూండడం, ఆ ఊళ్లలో ట్యూషన్లు అంగీకరించడంతో క్రమంగా శర్మగారికి వారు కన్పించడం తక్కువైంది. అయి దేళ్ల తరువాత అసలు కన్పించలేదు. కాని శర్మగారూ, ఆయన శిష్యులూ కూడా బన్సీలాల్‌నీ, అతని శాంతమైన పచ్చని

వదనాన్నీ, సున్నితమైన అతని సితార్ వాయిద్యాన్నీ, సుకుమారంగా మాట్లాడే అతని హిందీ సంభాషణనీ, మర్చిపోలేక పోయారు. మీరా భజన్‌లనూ, సూరదాసు పాటలనూ ఆయన సితార్‌లో లీనమై వాయించేవారు. అతని ప్రక్కనే, శిలా విగ్రహంలా కూచుని హరిబాబు తబలా వాయిస్తుండేవాడు. అతనికీ, హరిబాబుకీ ఉన్న తేడా అందరి మనస్సుల లోనూ మెదిలేది.

పదేళ్ల తరువాత మళ్లీ హరిబాబుని చూస్తుంటే అప్పటి సంగతులన్నీ జ్ఞాపకం వచ్చాయి శర్మగారికి. బన్సీలాల్‌ని చాలామంది సితార్ బాబాగా రనేవారు. అతని మంచితనం, వాయిద్యంలో నైపుణ్యం, ఎంతో గొప్పవని శర్మగారు మెచ్చుకున్నారు. ఆ విద్య మళ్లీ ఆ యింట్లో యింకెవరికైనా పట్టుబడిందా ? అని హరిబాబుని ప్రశ్నించారు. అతను లేదన్నాడు.

పూర్వం ఎంతో ముభావంగా ఉన్న హరిబాబు ఈరోజు చాలా విషయాలు మాట్లాడసాగాడు. "బాబుజీ ! మీతో అసలు విషయాలన్నీ చెప్పాలని బాబా చాలాసార్లు ఆలోచించారు. మీలో ఉన్న భగవద్భక్తి మాకు ఎంతో మేలు చేసింది. ముఖ్యంగా నాలో చాలా మార్పు తెచ్చింది. బాబాకి యిరవైనాలుగు గంటలూ నా గురించే బెంగ. మీ యింట్లో ఉన్న రోజులలో మా యిద్దరికీ భగవధ్యానం అలవడింది. ఆ రోజులలో మా పరిస్థితి కేవలం భగవత్సహాయం కోసమే ఎదురుచూస్తోంది. మీ దయవల్ల చివరకు మా కది లభించింది. ఆఖరి సమయంలో మిమ్మల్ని కలిసి వివరాలన్నీ చెప్పాలనుకున్నాం గాని, మా దేశం వెళ్లిపోవాలనే ఆతృతలో మిమ్మల్ని కలియలేదు. చనిపోయే ముందు కూడా బాబాగారు మిమ్మల్ని తల్చుకున్నారు."

అతని మాటలన్నీ శాంతంగా విన్నారు శర్మగారు. అతను చెప్పదల్చుకుంటే చెప్పవచ్చు నన్నారు. భోజనాలయి యిద్దరూ గదిలో కూచొని తాంబూలాలు వేసుకుంటు న్నప్పుడు హరిబాబు తమ కథ ప్రారంభించాడు. అది వింటూంటే శర్మగారికి ఆశ్చర్యం వేసింది.

"అసలు మేము సంగీత విద్వాంసులం కాము. బాబా సితార్ సరదాకోసం నేర్చుకున్నారు, గాని అది మా వృత్తే కాదు" అని ప్రారంభించాడు.

"అరె ! సరదాకోసం నేర్చుకుని అంత ప్రావీణ్యం సంపాదించారన్నమాట ! తమాషాగా ఉందే. మరి నీ తబ్లా ?" అని అడిగారు శర్మగారు.

"నేను కూడా సరదా కోసమే నేర్చుకున్నాను. ఆరోజుల్లో నేను చాలా దురలవాట్లకు లోనై తిరుగుతూండేవాణ్ణి. త్రాగుడు, జూదం, రౌడీ మూకలతో తిరగడం నా పద్నెనిమిదో ఏటినుండీ ప్రారంభమైంది. వ్యభిచారుల గృహాలకూ, నాట్యకత్తెల గృహాలకూ తరుచూ వెళ్తూండేవాడిని. నాట్యకత్తెల నాట్యానికి తరుచూ తబ్లా కూడా వాయిస్తూండేవాడిని. అలా కొంత పట్టుబడింది. తరువాత బాబా నేర్పారు." అని ఒక్క నిముషం ఆగి, చెప్పసాగాడు.

"మేము చాలా గౌరవంగా బ్రతికిన జమీందార్లము. బాబా చాలా దర్జాగా బ్రతకడమే గాక దానధర్మాలు విపరీతంగా చెయ్యడంవలన నేను పెద్దవాడి నయ్యేసరికే మా ఆస్తి చాలా హరించిపోయింది. అయినా ఆ మిగిలిన దానితో కొంతవరకూ గౌరవంగా బ్రతుకుతూండేవాళ్లం. బాబాకి నే నొక్కడినే కుమారుడను. నా ప్రవర్తన ఆయనకు చాలా బాధ కలిగిస్తూండేది. నా యిరవయ్యో సంవత్సరంలో నాకు వివాహం చేశారు. నాకు చదువు అబ్బకపోవడంవల్ల, ఏ వృత్తిలోనూ ప్రవేశించలేకపోయాను. నన్నొక పెద్ద లాయర్ని చెయ్యాలన్న ఆయన ఆశయం ఫలించలేదు.

"అలా తిరుగుతూ కాలం వృథా చేస్తూండగానే జూదం అడ్డంలో బాగా దిగిపోయాను. నాకు ఇద్దరు పిల్లలు పుట్టినా, సంసార బాధ్యత తెలిసిరాలెదు. అన్నిటికీ బాబాయే తంటాలుపడ్తూండేవాడు. ఇలా ఉంటూండగా మా ఊళ్లో ఒ నాడు పెద్ద దెబ్బలాట జరిగింది. మాకూ, సుఖదేవ్ అనే మరొక డబ్బుగల వ్యక్తి పార్టీకి మాటా మాటా వచ్చి కొట్టుకునేటంత వరకూ వచ్చింది. ఆ దెబ్బలాటలో మా పార్టీ ఓడిపోయింది. సుఖదేవ్ పార్టీవాళ్లంతా సంతోషంగా విందు చేసుకున్నారు. ఆ రాత్రి నేనూ మరొక ఇద్దరు రౌడీలూ కలిసి సుఖదేవ్‌కి బుద్ధి చెప్పాలని నిశ్చయించాము. అర్ధరాత్రి అతని ఇంటి పెరట్లోకి ప్రవేశించాము. అదను చూసి అతనిని అంత మొందించాలని మా ఆశ. రాత్రి ఒంటిగంటకు అతను పెరట్లోకి వచ్చాడు. వెంటనే అతనిమీద కురికి కత్తులతో పొడిచాం. కాని, అతను చాలా బలవంతుడు. మమ్మల్ని చూడగానే పెద్ద కేకవేసి, మాతో పెనుగులాడ నారంభించాడు. అతనికి బలమైన గాయాలు తగిలాయి. ఇంతలో అతని మనుష్యులు వచ్చారు. మేము మా యిళ్లకు పారిపోయాం. సుఖదేవ్‌ని వెంటనే అతని మనుష్యులు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్లారు. అతను, మే మూహించినట్లు చనిపోలేదు. స్పృహ కోల్పోయాడు. డాక్టర్ కట్టు కట్టి, కొద్ది గంటలలో అతనికి స్పృహ వస్తుందని చెప్పాడు. పోలీసులు అతని స్టేటుమెంటు కోసం కాపలా కాయసాగారు.

"ఆ రాత్రి నే నింట్లో ప్రవేశించేసరికి బాబా మెలకువతో ఉన్నారు. రక్తసిక్తమైన నా బట్టలు చూసి, జరిగిన సంగతి చెప్పమన్నారు. నేను చెప్పేశాను. సుఖదేవ్ స్టేట్మెంటు యిచ్చే సమయానికి, పోలీసులు మావెంట పడ్తారని గ్రహించాం. ఎందుకంటే అతను స్పష్టంగా మమ్మల్ని చూశాడు. ఇక నాకు ఉరిశిక్ష ఖాయం అని బాగా గ్రహించారు. ఇక చేయగలిగిందల్లా తెల్లవారేలోపల నేను అక్కడి నుంచి పారిపోవడమేను. కానీ, నేను పోలీసుల్ని తప్పించుకోగలనని బాబాకి నమ్మకంలేదు. అందుకని వెంటనే నా తల్లినీ భార్యనీ లేపి ఇల్లూ, వాకిలీ, ఆస్థీ జాగ్రత్తగా చూసుకోమని అప్పజెప్పి బాబా నన్ను తీసుకుని బయల్దేరి ఈ దేశం వచ్చేశారు. వస్తూ ఆయన సితార్ తెచ్చుకున్నారు. మేము, ఒక నూతన జీవితం ప్రారంభించాం. మీవద్దకు రాకముందు మేము మూడు, నాలుగు నెలలు ఎన్నో బాధలు పడ్డాం. కొన్ని రోజులు తిండికి కూడా ఇబ్బందిపడ్డాం. ఇంటికి ఉత్తరం రాయాలంటే భయం. దాని ఆధారంతో పోలీసులు మమ్మల్ని పట్టుకుంటారేమో అని భయం." మిమ్మల్ని కలుసుకున్న తరువాత మా ఇబ్బందులు తీరాయి.

"అయితే మళ్లీ దేశం ఎలా వెళ్ళగలిగారూ?" అని శర్మగారడిగారు.

"ఈ ప్రాంతాలలో అయిదేళ్లు గడిపాక ఒకసారి మద్రాసు వెళ్లాం. మద్రాసులో స్టేషనులో, అకస్మాత్తుగా మా మామగారిని కలుసుకున్నాం. ఆయన ఏడాదినుండి మా కోసం దేశం అంతా తిరుగుతున్నారట. ఆయన చెప్పారు సుఖదేవ్ చనిపోతూ, తనని చంపడానికి వచ్చినవారి పేర్లు చెబుతూ, నాతో వెళ్లిన ఇద్దరి పేర్లూ మాత్రం చెప్పి ప్రాణం వదిలేశాడట. అందువల్ల వా రిద్దరికీ శిక్ష పడింది. నామీద అనుమానం ఉన్నా, మరే ఋజువూ దొరకలేదుట. కాబట్టి వెంటనే నన్ను దేశం వచ్చెయ్యమన్నారు. అప్పుడు మా సంతోషం చెప్పతరంకాదు. వెంటనే దేశం వెళ్లిపోయాం. ఇక్కడ గడిపిన అయిదేళ్లూ నాకు చాలా విషయాలు నేర్చుకునే అవకాశం యిచ్చాయి. బాబా నాకోసం పడ్డ అవస్థలు జూసి, తండ్రి చేసే త్యాగం ఎంత గొప్పదో తెలుసుకున్నాను. మీవద్ద సత్ప్రవర్తనా, మంచి జీవితాలలో ఉండే శాంతి గ్రహించాను. దేశం చేరుకున్న దగ్గర్నుంచీ, వ్యాపారం ప్రారంభించి, డబ్బు సంపాదనలో కాలం గడపసాగాను. నాలో వచ్చిన మార్పుకు బాబా ఎంతో సంతోషించారు. ఇదంతా మీ ఆశీర్వాద ఫలమే" నని తన కథ ముగించాడు హరిబాబు.

శర్మగారూ, లక్ష్మీదేవీ కూడా అతని కథ విన్నారు. ఆ రాత్రంతా హరిబాబు తన తండ్రి పడిన కష్టాలూ, అతనికి తనయందు గల ప్రేమా వర్ణించి చెప్తూంటే, వింటున్న లక్ష్మీదేవి మనసులో "ఆహా! కొడుకంటే ఇలా ఉండాలి. తలిదండ్రులయం దితని కున్నట్లు భక్తి గౌరవాలుండాలి." అని ఆలోచించసాగింది.

కాని అతని మాటలు విన్నప్పుడే కాక తరువాత రాత్రంతా కూడా శర్మగారి మనసులో మరొక విధమైన ఆలోచనలు పరుగెత్తాయి. "తండ్రంటే, బన్సీలాలే తండ్రి! కొడుకు కోసం ఎంత త్యాగమైనా చెయ్యడానికి సిద్ధపడ్డాడు. చేశాడు. కాబట్టే అటువంటి మూర్ఖుడైన కొడుకు మనసు తండ్రి త్యాగంతో వికసించింది. నేను డబ్బిచ్చి ఒక కొడుకుని కొనుక్కున్నాను. వాడికి నాయందు ప్రేమ ఎలా కలుగుతుంది? వాడికోసం నేనే త్యాగం చేశాను? వాడికి నామీద ఏ కారణంవల్ల గౌరవం కలిగే అవకాశం ఉంది? డబ్బుని ఎరగా చూపించి కొడుకుని చేసుకున్నప్పుడు, ఆ కొడుకుకి డబ్బుమీద ఆశ తప్ప, మరొక భావమేమి ఉంటుంది? నవ మాసాలూ మోసి కనిన బిడ్డా కాదు. చిన్నతనం నుంచీ, తనను అన్నివిధాలా కాపాడిన తలితండ్రులా కారు. అలాంటి వారికి పరస్పర బాంధవ్యం ఏముంటుంది? వాడు నన్ను ప్రేమించలేదని ఎందుకు బాధపడాలి. అసలు నేను దత్తత చేసుకోవడమే పొరపాటు. నాలో, మనసూ, ప్రేమా, జాలీ, త్యాగం అన్నీ భగవదర్పితమైపోయాయి. మరొక మానవుణ్ణి భగవత్స్వరూపుడిగా తప్ప స్వార్థంతో—నావాడు—అని చూడలేను. అటువంటప్పుడు నేను ఇతరులను కూడా ఆదరించక తప్పదు. కాని, అది దత్తుడి దృష్టిలో—అనవసర ఖర్చులా కన్పించవచ్చు. అసలు జీవితంలో అన్నిటిమీదా వ్యామోహం వదులుకున్న నాకు, ఈ బంధం మాత్రం ఎందుకు?" అని ఆలోచించసాగారు.

మర్నాడు ప్రొద్దున్న హరిబాబు వెళ్లిపోయాడు.

శర్మగారి మనసు ఆ రోజల్లా ఈ ఆలోచనలతోనే గడిపింది. చివరికి ఒక నిర్ణయానికి వచ్చేశారు. వెంటనే సూర్యనారాయణకీ, సీతారామయ్యగారికీ కబురు పెట్టారు.

ఇల్లూ, మిగిలిన చరాస్థీ, పూచికపుల్లతో సహా సూర్యనారాయణ కప్పజెప్పేసి, తాము తీర్థయాత్రలకు వెళ్లిపోతున్నామని, మరి తిరిగి రామనీ చెప్పేసారు. మర్నాడు అందుకు తగిన ఏర్పాట్లన్నీ సీతారామయ్యగారి ఆధ్వర్యంలో జరిగిపోయాయి. ఇప్పటికి తన పాచిక పూర్తిగా పారినందుకు ఆయన సంతోషించారు.

మర్నాడు సాయంకాలం కొన్ని బట్టలూ, కొద్ది సామానూ తీసుకున్నారు. స్నేహితులూ, శిష్యులూ చాలా మంది ఆయనకు వీడ్కోలు ఇవ్వటానికి వచ్చారు. తాము ముందు కాశీ వెళ్తున్నామనీ, అక్కణ్ణుంచి అన్ని పుణ్య క్షేత్రాలకూ వెళ్తామనీ, అన్ని ఊళ్లలోనూ తమ శిష్యులూ స్నేహితులూ ఉన్నారని అందువలన తమకేలోటూ రాదని అందరితో చెప్పసాగారు. ఇంటిముందు జట్కా వచ్చి నిలబడింది.

లక్ష్మిదేవి కిదంతా అయోమయంగా ఉన్నా 'భర్తననుసరించడమే తన విధి' అని అనుసరిస్తోంది.

సూర్యనారాయణ మొహంలోని భావ మేమిటో ఎవరికీ అర్థంకాలేదు, గంభీరంగా ఉన్నాడు.

సీతారామయ్యగారు పైకి ఎంత విచారం ప్రకటిద్దామని ప్రయత్నిస్తున్నా, ఆయన ఎంతో ఆనందంగా ఉన్నారని తెలుస్తూనే ఉంది.

శర్మగారూ, లక్ష్మిదేవీ బయటకు వచ్చారు. ఇంటి తాళంచెవులూ, పెటె తాళం చెవులూ కలిపిన గుత్తి శర్మగారు ''ఇదిగో'' అని సీతారామయ్యగారి కివ్వబోతూంటే ''ఇలా ఇవ్వండి!'' అని సూర్యనారాయణ తీసుకున్నాడు. అంతా ఇంటి బయట అరుగుమీద ఉన్నారు.

''అయ్యా! సీతారామయ్యగారూ!'' అని పిల్చాడు సూర్యనారాయణ. అందరూ అతనివైపు చూశారు ''ఇదేమి?'' అని, అనుకున్నారు.

శర్మగారూ, సీతారామయ్యగారూ అర్థంకానట్టు ఒకరివైపొకరు చూసుకున్నారు. సూర్యనారాయణ ''మీకూ నాకూ సంబంధం తీరిపోయింది, మీరు నన్ను శర్మగారికి దత్తత ఇచ్చినవాడే. కానీ మీ యింట్లో పెరగబట్టి మీ మాటలు ఇన్నాళ్లు విన్నాను. ఇవాళ నా యిల్లేదో నాకు తెలిసింది. మీర. ఇంకా ఈ యింట్లో జేరి నా ఆస్థి అపహరిద్దాం అనుకుంటున్నారేమో! అది కల్ల! ఇక మీరీ యింటి ఛాయలకు రావద్దు. ఆనాడే నాకు మీరు దూరమయ్యారు. ఇక నాకు తలిదండ్రులు శర్మగారూ వారి భార్యే. వారితో, నేనుకూడా నాలుగూళ్లూ తిరిగి వస్తాను. ఇహ మీరు దయచెయ్యండి'' అని సీతారామయ్యగారితో చెప్పి, ''నాన్నగారూ! ఇల్లు తాళం వేసి వస్తాను. నా పెట్టె ఇందాకే బండిలో పెట్టించాను అందులో మనకు కావలసినవన్నీ ఉన్నాయి.'' అని శర్మగారితో చెప్పి గబగబ ఇల్లు తాళం వేసేసి, బండి ఎక్కాడు—శర్మగారూ, లక్ష్మిదేవీ కూడా ఆశ్చర్యంతో బండి ఎక్కారు.

బండి కదిలిపోతూంటే, సీతారామయ్య స్పృహతప్పి పడిపోయాడు.

---

ఎవఁడు ప్రాపంచిక సుఖంబు నీసడించు
ముష్టివాఁడౌనొ యాతఁడే భూవిభుండు
పృథ్వినాథులాతనిముందు బిచ్చగాండ్రు
విడుపు పట్టులలోనంత భేదముండు
భూరమణదాసజనమధ్య తారతమ్య
మిట్టె నశియించు సన్యాసి దృష్టియందు.

—పానుగంటి. చూడామణి.